నమస్తే తెలంగాణ
జనగామ
10 | వరంగల్, సోమవారం 9 డిసెంబర్ 2024 | JANAGAON

# బతుకమ్మ లేకుండా తెలంగాణ తల్లి విగ్రహమా!



## అసమగ్రంగా రూపురేఖలు

- పాలకుల పిల్ల చేష్టలు.. పార్టీ గుర్తు కనపడేలా ఉంది
- తెలంగాణ తల్లి విగ్రహ మార్పుపై సాహితీవేత్తల అభిప్రాయాలు

పోచమ్మమైదాన్, డిసెంబర్ 8 : రాష్ట్ర రాజధాని సచివాలయంలో ఏర్పాటు చేస్తున్న తెలంగాణ తల్లి విగ్రహంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 'తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతినకుండా, అన్ని వర్గాల ప్రజలు ఆమోదిస్తూ, రాజకీయాలకతీతంగా ఉండాల్సిన విగ్రహాన్ని మార్పులు చేయడమేమిటి? పార్టీలు మారినప్పుడల్లా ఇలా తెలంగాణ తల్లి ఆనవాళ్లను మార్చుకుంటూ పోతే ఎంతో మంది కష్టపడి, ప్రాణాలను తెగించి తెచ్చుకున్న ప్రత్యేక రాష్ట్రానికి ఏం విలువ ఉంటుంది. తొలి, మలి దశ ఉద్యమంలో మహిళలు భక్తిశ్రద్ధలతో ఆరాధించే బతుకమ్మ ఫొటో లేకపోవడం, అధికార పార్టీకి ఎన్నికల చిహ్నంగా ఉన్న హస్తంను చూపించడం, సాధారణ మహిళగా కనిపించడంపై తెలంగాణ ప్రజలను నిరుత్సాహానికి గురిచేస్తుంది' అని పలువురు సాహితీ వేత్తలు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు.



### కేసీఆర్ ఆనవాళ్లను అంతమొందించడానికే..

కేసీఆర్ ఆనవాళ్లను అంతమొందించాలని పనిగట్టుకుని రూపుమాపే ప్రయత్నం. ఇది ముమ్మాటికీ పిల్లల చేష్టగా ఉంది. విగ్రహం రూపురేఖలు అసమగ్రంగా ఉన్నాయి. ప్రభుత్వం చేయాల్సిన అనేక ప్రజాహిత కార్యక్రమాలను విడిచిపెట్టి పాలకులు ఈ ఆకతాయి చేష్టలు చేస్తున్నారు. ఇందుకు ప్రజాధనాన్ని వెచ్చిస్తూ సమయాన్ని వృథా చేయడం క్షమించరాని దుశ్చర్య.

– రామా చంద్రమౌళి, ప్రముఖ కవి, రచయిత

### భారతమాతను కూడా ఇలాగే మార్చుతారా?



ప్రస్తుత ముఖ్యమంత్రి ఏర్పాటు చేయనున్న తెలంగాణ తల్లి విగ్రహం రూపురేఖలు సామాన్య ముత్తయిదువలా ఉంది. ఇది ఎవరూ సహించరు. ఇలా తయారు చేయడం వారి విజ్ఞాన పతనానికి నాంది. తెలంగాణ తల్లి ఒక దేవతలా ఉండాలి. పూజనీయురాలిగా కనపడాలి. విగ్రహ మార్పును ప్రజలు వ్యతిరేకించాలి. ఇలా చూస్తుంటే భారతమాత విగ్రహాన్ని కూడా మార్చేలాగున్నారు. రేపు రాజశాసనం కూడా మార్చితే ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు.

– కాజీపేట తిరుమలయ్య, జిల్లా రంగస్థల కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు

### పార్టీ గుర్తుగా విగ్రహం ఉండకూడదు..



తెలంగాణ తల్లి విగ్రహంలో పార్టీ గుర్తు కనపడేవిధంగా ఉండకూడదు. రాజ్యాంగబద్ధంగా ఉండాలి. విగ్రహాన్ని తయారు చేసేటప్పుడు అన్ని కోణాల్లో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. ప్రజల నుంచి విమర్శలు రాకూడదు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చినట్లు రేపు తెలంగాణ గీతం మార్చబడవచ్చు. అయితే అందెశ్రీ ఉద్యమ గీతం మాదిరిగానే తాను రాష్ట్రగీతం రాసి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా.

–మహమ్మద్ సిరాజుద్దీన్, ప్రముఖ కవి

### ఇలాగే మరికొందరి సాహితీవేత్తల అభిప్రాయాలు...

తొలిదశ, మలిదశ ఉద్యమంలో బతుకులను ఆరాధించే బతుకమ్మలను ఎంతో భక్తి శ్రద్ధలతో ఆరాధించామని కాళోజీ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగిళ్ల రామశాస్త్రి, వీఆర్ విద్యార్థి అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహంలో బతుకమ్మ లేకపోవడం వెలితిగా ఉందన్నారు. ప్రపంచంలో ఎక్కడా కూడా బతుకమ్మ లేదని, పక్కన ఉన్న ఆంధ్రలో కూడా బతుకమ్మ ఆట ఆడరని అన్నారు. కాళోజీ కవితల్లో బతుకమ్మ విశిష్టతను చెప్పారని గుర్తుచేశారు. మాతృత్వం అందించిన తల్లిలా, దేవతలా చూసుకోవాలని గాని, కొత్త విగ్రహంలో ఆ భావన కలగడం లేదని ప్రముఖ కవి సారంగం అన్నారు. జన్మభూమిశ్చ అనేది సామెత. అయితే తెలంగాణలో పుట్టిన వారికి ఆ విగ్రహం తెలంగాణ మూలాలు అందించడం లేదని పేర్కొన్నారు. విగ్రహ ముఖ్యం కాదు. ఆ తెలంగాణ మన తల్లి తన పిల్లలను ఆకలి దప్పులు లేకుండా తీరుస్తుందని ప్రముఖ కవి పల్లేరు వీరస్వామి అన్నారు. విగ్రహాలను పెట్టడం, మార్చడం కాదూ, ప్రజా సమస్యపైన ఎక్కువ దృష్టి పెట్టాలని ప్రముఖ రచయిత అనిశెట్టి రజిత అన్నారు.ప్రజల కోసం ఎక్కువ ఖర్చు పెడుతూ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చేపట్టాలని, ప్రభుత్వం ఏ పార్టీకి చెందినప్పటికీ ప్రజల ఇబ్బందులు తీర్చడమే మొదటి కర్తవ్యంగా ఉండాలని పేర్కొన్నారు. బతుకమ్మలు, పోచమ్మలు తెలంగాణకు ప్రత్యేక సంస్కృతిగా ఉంది అని, విగ్రహంలో బతుకమ్మ బొమ్మ తీసేయడం నచ్చలేదని ప్రముఖ రచయిత మమత తెలిపారు. అలాగే కిరీటాలు ఎందుకు తీశారో తెలియదు. ఒక మార్పు కోసం మూలం మర్చిపోయారేమోనని పేర్కొన్నారు.

# చెత్తగుట్టలు కరిగేదెన్నడో?

కొత్తగా మరో 6 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త నిల్వలు



రాంపూర్‌లోని బల్దియా డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్త

- మరో ఆలోచన చేయని బల్దియా
- కొత్తగా మరో 6 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త నిల్వలు
- డంపింగ్ యార్డులో పేరుకుపోతున్న వ్యర్థాలు
- ప్రతిపాదనకే పరిమితమైన వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటు

## వరంగల్ నగరంలో బయో మైనింగ్ విఫలం

**దూరం నుంచి చూస్తే మామూలు గుట్టల్లా కనిపిస్తున్నా.. నిజానికి అవి 'చెత్త' గుట్టలు. వరంగల్ నగరంలోని రాంపూర్ డంపింగ్ యార్డు పరిస్థితి ఇదీ. రోజురోజుకూ పెరుగుతున్న చెత్త నగరవాసులకు ఆందోళన కలిగిస్తున్నది. డంపింగ్ యార్డులో 3.75 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించేందుకు మూడేళ్ల క్రితం బల్దియా చేపట్టిన బయోమైనింగ్ ప్రక్రియ కొన 'సాగు' తూనే ఉంది. దీంతో పాటు అప్పటి నుంచి కొత్తగా డంపింగ్ యార్డుకు సుమారు 6 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త వచ్చి చేరడంతో గుట్టలు గుట్టలుగా పేరుకుపోయింది. హైదరాబాద్ తరహాలో వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమైంది. పాలకులు, అధికారుల్లో చి(చె)త్తశుద్ధి లేకపోవడంతో నగరానికి చెత్త సమస్య సవాల్ విసురుతున్నది.**

- వరంగల్, డిసెంబర్ 8

రాంపూర్ డంపింగ్ యార్డులో పేరుకుపోతున్న చెత్తను తగ్గించేందుకు మూడేళ్ల క్రితం బల్దియా చేపట్టిన బయో మైనింగ్ ప్రక్రియ సక్సెస్ కాలేదు. 3.75 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను బయో మైనింగ్ చేసే ప్రక్రియ మూడేళ్లుగా జరుగుతూనే ఉంది. ఇప్పటికీ పూర్తి కాలేదు. అప్పటి నుంచి కొత్తగా తరలిస్తున్న చెత్త ఇప్పటికే సుమారు 6 లక్షల మెట్రిక్ టన్నులకు చేరుకుంది. రోజూ సుమారు 450 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతున్న నగరంలో చెత్తశుద్ధి చేసేందుకు బల్దియా పాలకులు, అధికారులు ఆలోచనలు చేయకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. మహ నగరాల్లో అవలంబిస్తున్న పద్ధతులను అధ్యయనం చేసే దిశలో ముందడుగు వేయడం లేదు.

**బయోమైనింగ్ విఫలం**



డంపింగ్ యార్డులో చెత్తను తొలగించేందుకు చేపట్టిన బయో మైనింగ్ ప్రక్రియ సక్సెస్ కాలేదు. 3.75 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను ఏడాదిన్నర కాలంలో శుద్ధి చేయాలని టెండర్ ఇచ్చారు. ఇప్పటికే మూడేళ్లుగా సాగుతున్న సుమారు 3లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను మాత్రమే శుద్ధి చేశారు. టెండర్ గడువు ముగిసి ఏడాది కాలం అయినప్పటికీ వారికి కేటాయించిన లక్ష్యం చేరుకోలేదు. ఇంకా 75 వేల మెట్రిక్ టన్నుల చెత్తను శుద్ధి చేయాల్సి ఉంది. వరంగల్ మహా నగరానికి బయో మైనింగ్ విధానం సరైనది కాదని అధికారులే అభిప్రాయ పడుతున్నారు.

**కొత్తగా 6 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త**

రాంపూర్‌లోని బల్దియా డంపింగ్ యార్డులో బయోమైనింగ్‌కు కేటాయించిన చెత్త కాకుండా కొత్తగా సుమారు 6 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయి ఉంది. 3 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త శుద్ధికి మూడేళ్లు పడితే కొత్తగా వచ్చి చేరుతున్న చెత్తకు ఇంకెన్నేళ్లు పట్టాలన్నది సమాధానం లేని ప్రశ్నగా మిగిలింది. నగరంలో చెత్త ఉత్పత్తి అనేది నిరంతర ప్రక్రియ. దానిని నియంత్రించడం సాధ్యం కాదు. డంపింగ్ యార్డుకు చేరిన చెత్తను తొందరగా శుద్ధి చేయడం బల్దియా చేయాల్సిన పని. అయితే పాలకుల నిర్లక్ష్యంతో పెరుగుతున్న చెత్తగుట్టలతో ఏ రోజు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని పరిసర ప్రాంతాల ప్రజలు భయంతో వణికిపోతున్నారు.

**ప్రతిపాదనల్లోనే వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్**

గతంలో నగరాభివృద్ధిపై హైదరాబాద్‌లో జరిగిన సమీక్షల్లో వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్‌పై చర్చించారు. అధికారులను ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రులు ఆదేశించారు. ఈ ప్లాంట్ ఏర్పాటుకు సుమారు రూ. 800 కోట్లు ఖర్చవుతున్నదని అంచనా వేశారు. చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేయడానికి 10 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త ఉండాలన్న సూచనలతో అధికారు లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. వరంగల్, కరీంనగర్ కార్పొరేషన్‌ల మధ్యన 30 ఎకరాల స్థలం సేకరించి రెండు నగరాలకు కలిపి వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు ముందుకు కదలడం లేదు. చెత్త సమస్యకు సత్వర పరిష్కార మార్గాలు అన్వేషించకుంటే భవిష్యత్‌లో పరిస్థితులు జఠిలం కానున్నాయని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఉమ్మడి జిల్లా నేతలు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను కలిసిన వారిలో ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి ఉన్నారు.

# ఆర్డర్ తప్పిన పోలీసు!

చోటుచేసుకుంటున్న హత్యలు, దాడులు, దోపిడీలు

రెచ్చిపోతున్న ఖద్దరు చొక్కా లీడర్లు, రౌడీ షీటర్లు



- అంటకాగుతున్న పోలీసు అధికారులు
- నియంత్రణ మరిచి.. సంపాదనపైనే దృష్టి
- వరుస ఘటనలతో వణుకుతున్న ప్రజలు

## వరంగల్ కమిషనరేట్ పరిధిలో పెరుగుతున్న నేరాలు

సుబేదారి, డిసెంబర్ 8 : వరుస హత్యలు, దాడులు, దోపిడీలతో వరంగల్ వణుకుతున్నది. పోలీసు కమిషనరేట్ పరిధిలో రోజు ఏదో ఒక చోట హత్య లేదా హత్యాయత్నం, చోరీ ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ వరుస ఘటనలతో ప్రజలు వణికిపోతున్నారు. ఇక వరంగల్ నగరంలో నేరాలు నిత్యకృత్యంగా మారాయి. ఇటీవల ఒకే రోజు మట్టెవాడ పోలీసు స్టేషన్ పరిధి రంగంపేట ప్రాంతంలో కారులో హత్యకు గురైన వృద్ధుడి మృతదేహం లభించడం, కాజీపేట పోలీసు స్టేషన్ పరిధి బాపూజీ నగర్‌లో మరో వృద్ధుడిపై ఓ యువకుడు కత్తితో దాడిచేసిన ఘటనలు కలకలం రేపాయి. ఇదిలా ఉంటే నగరంలో కొందరు రౌడీషీటర్లు మళ్లీ రెచ్చిపోతూ అమాయకులపై దాడికి పాల్పడుతున్నారు. నగరంతోపాటు, కమిషనరేట్ పరిధిలో ప్రతి రోజూ దోపిడీలు చోటుచేసుకుంటున్నాయి. కొద్ది రోజుల క్రితం కాజీపేట పోలీసు స్టేషన్ పరిధి ప్రశాంత్‌నగర్‌లో ఓ కుటుంబం బయటకు వచ్చి గంటలోపే ఇంటికి చేరుకునే సరికి పెద్ద ఎత్తున బంగారం చోరీ జరిగింది. రాయపర్తి పరిధిలో ఎస్‌బీఐ బ్యాంకులోని బంగారాన్ని దొంగలు ఎత్తుకెళ్లారు. ఇలాంటి తీవ్రమైన నేరాలను నియంత్రించడంలో లా అండ్ ఆర్డర్ పోలీసులు విఫలమవుతున్నారనే విమర్శలున్నాయి. ఇక కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న కొందరు ఇన్‌స్పెక్టర్లు, ఏసీపీలు నేరస్వభావం, హత్యా నేరాల్లో నిందితులుగా ఉన్న ఖద్దరు చొక్కా లీడర్లకు సపోర్ట్ చేయడంతో వారి మాటున రౌడీలు రెచ్చిపోయి దందాలకు పాల్పడుతున్నారు. నేరాల నియంత్రణ విషయమై సీపీ అంబర్ కిశోర్ ఝా కఠినంగా ఉన్నప్పటికీ కింది స్థాయి అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. తీవ్రమైన కేసుల దర్యాప్తు విషయంలో సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ నెలల తరబడి నిందితులను పట్టుకోవడం లేదని తెలుస్తున్నది. కొన్నేళ్ల క్రితం వరంగల్ నగరంలో రౌడీలు అధిపత్య పోరు, ఉనికి కోసం రౌడీయిజం చేసేవారు. ఇది పరస్పర దాడులు, హత్యలకు దారి తీసింది. అప్పటి పోలీసు అధికారులు నిక్కచ్చిగా వ్యవహరించి ఉక్కుపాదంతో అణిచి వేసి కరుడుకట్టిన రౌడీషీటర్లను ఎన్‌కౌంటర్ చేసిన చరిత్ర వరంగల్ పోలీసులది. ఎన్నో కేసులను ఛేదించి పేరు తెచ్చుకున్నారు.

### ట్రాక్ తప్పుతున్న లా అండ్ ఆర్డర్




వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో లా అండ్ ఆర్డర్ గతి తప్పుతున్నది. ప్రధానంగా భూతగాదాలు, వివాహేతర, ఆర్థిక సంబంధాలు, క్షణికావేశం, ఆధిపత్యం కోసమే నేరాలు జరుగుతున్నట్లు తెలుస్తున్నది. పొలిటికల్ సపోర్ట్‌తో పోస్ట్ తెచ్చుకున్న కొందరు అధికారులు రోజువారీ సంపాదనపైనే దృష్టిపెడుతున్నారని, ఉన్నంత కాలం ఏదో అలా పనిచేశామనిపించునే ధోరణే తప్ప నేరాల అదుపునకు నిఘా పెట్టడం లేదనే ఆరోపణలున్నాయి. అయితే పోలీసు శాఖలో పదేళ్లలో అనేక సంస్కరణలు వచ్చాయి. కొత్త వాహనాలు, టెక్నాలజీ, సైబర్ నేరాలకు ప్రత్యేకమైన వ్యవస్థ, మహిళలు, బాలికల రక్షణ కోసం షీ టీంలు, మత్తు పదార్థాల నియంత్రణకు ప్రత్యేక విభాగం, నేరస్తులను సులువుగా పట్టుకోవడానికి సీసీ కెమెరాలు అందుబాటులోకి వచ్చాయి. ఇలాంటి అత్యాధునిక వసతులతో లా అండ్ ఆర్డర్‌లో పనిభారం తగ్గడంతో పాటు పోలీసుల సంఖ్య కూడా పెరిగింది. అయినప్పటికీ కమిషనరేట్ పరిధిలో నేరాలు జరుగుతూనే ఉన్నాయి. వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది జనవరి 1 నుంచి ఈ నెల 2 వరకు 34 హత్యలు, 96 హత్యాయత్నాలు, 20 దోపిడీలు,18 చైన్ స్నాచింగ్‌లు జరిగినట్లు పోలీసు రికార్డులు చెబుతున్నాయి.

# శంకుస్థాపన చేసి ఏడాదైనా పనులేవి?

- హార్టికల్చర్ రిసెర్చ్ స్టేషన్‌పై ఊసేలేని రేవంత్ సర్కారు
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



కన్నారావుపేటలో శిలాఫలకం వద్ద మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నల్లబెల్లి, డిసెంబర్8: హార్టికల్చర్ రిసెర్చ్ స్టేషన్‌కు శంకుస్థాపన జరిగి ఏడాదైనా పనులు ప్రారంభించడంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి కరువైందని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. నల్లబెల్లి మండలంలోని కన్నారావుపేట గ్రామ పరిధిలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో శంకుస్థాపన చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ రిసెర్చ్ స్టేషన్ స్థలం వద్ద పెద్దితోపాటు బీఆర్ఎస్ నాయకులు, స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పెద్ది మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీకి అనుసంధానంగా ఉండేలా నాటి సీఎం కేసీఆర్ ప్రోద్బలంతో తాను ఉద్యానవన పంటల పరిశోధన కేంద్రాన్ని మంజూరు చేయించానని తెలిపారు. ఈ స్టేషన్ ద్వారా మిర్చి, పసుపు, కాయగూరలతో పాటు పండ్ల తోటలతోపాటు ఆయిల్ పామ్ లాంటి పంటలపై పరిశోధన, సీడ్ తయారీకి ఎంతగానో దోహద పడుతుంద న్నారు. అత్యంత ప్రాధాన్యత కల్గిన హార్టికల్చర్ రిసెర్చ్ స్టేషన్‌ను మంజూరు చేస్తే ఎమ్మెల్యే ఏడా ది పూర్తయినా పనులు ప్రారంభించక పోవడం శోచనీయమన్నారు. ఆయనకు అభివృద్ధిపై ఓ విజన్ లేదు కనీస అవగాహన లేదని ఆరోపించారు. పలుమార్లు ప్రస్తుత వ్యవసాయశాఖ మంత్రి కి లేఖలు రాసినా ఫలితం లేదన్నారు. ఇకనైనా నెల రోజుల్లో హార్టికల్చర్ రిసెర్చ్ స్టేషన్ పనులు ప్రారంభించకుంటే ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఉద్యమిస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, మాజీ సర్పంచ్ తంగెళ్ల నిర్మల, నాయకులు ఊడుగుల ప్రవీణ్‌గౌడ్, కక్కెర్ల శ్రీనివాస్‌గౌడ్, హరినాథ్‌సింగ్, కొత్తపల్లి కోటిలింగాచారి, నూనావత్ వెంకన్న, మామిడిశెట్టి రవి, పల్నాటి మూర్తి పాల్గొన్నారు.


# వైభవంగా పల్లివేట

- నర్సంపేటలో కనులపండువగా శోభాయాత్ర
- ఆకట్టుకున్న మాలధారుల విన్యాసాలు
- మార్మోగిన అయ్యప్ప నామస్మరణ



ఆకట్టుకుంటున్న వేషధారణ

నర్సంపేట, డిసెంబర్ 8: శబరిమలైలో జరిగే విధంగా అయ్యప్ప పల్లివేట, ఉత్సవ బలి, క్షేత్రబలి కార్యక్రమాన్ని నర్సంపేట పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన అయ్యప్ప భక్తులు, అయ్యప్ప మాలధారులు తరలివచ్చారు. ఈ సందర్భంగా స్వామి వారిని పూల రథంలో ఎక్కించి డప్పువాయిద్యాల మధ్య అయ్యప్ప ఆలయం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చారు. ఉదయం ప్రారంభమైన శోభాయాత్ర మధ్యాహ్నం వరకు సాగింది. పట్టణంలోని దారి పొడవునా భక్తులు దీపారాధనతో పాల్గొన్నారు. భోనాలతో మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అయ్యప్ప మాలధారులు నృత్యాలు చేస్తూ ముందుకు సాగారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో పుంగావనంలో అయ్యప్ప స్వాములు బాణాలు పట్టుకుని వేటకు వెళ్లారు. తర్వాత అయ్యప్పస్వామికి అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా గురుస్వామి వెంకటేశ్వరశర్మ ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప నామస్మరణతో మున్సిపల్ కార్యాలయ పరిసరాలు మార్మోగాయి. పట్టణంలోని రోడ్లన్నీ స్వాములతో నిండిపోయాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు సైపా సురేశ్, కార్యదర్శి చింతల కమలాకర్‌రెడ్డి, కోశాధికారి దొడ్డ రవీందర్, అన్నదాత, పల్లివేట దాత గోగుల జయశ్రీ, ప్రతాపరెడ్డి, లక్ష్మీభార్గవి, రాణాప్రతాప్‌రెడ్డి, సూర్యప్రతాప్‌రెడ్డి, చంద్రప్రతాప్‌రెడ్డి, మాదారపు చంద్రశేఖర్, శ్రీరాం ఈశ్వరయ్య, వంగేటి గోవర్ధన్, ఇరుకుల వీరలింగం, భూపతి లక్ష్మీనారాణ, బొద్దుల దివాకర్, చింతల నిరంజన్ పాల్గొన్నారు.



శివనగర్‌లో బయటపడిన విగ్రహం

# శివనగర్‌లో బయటపడిన విగ్రహం

ఖిలావరంగల్, డిసెంబర్ 8: శివనగర్‌లో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల్లో ఆదివారం విగ్రహం బయట పడింది. శాసనం రాళ్లను తలపించేలా శివలింగంపై సూర్య చంద్రుల విగ్రహాలు చెక్కి ఉన్నాయి. అలాగే, శివలింగానికి కింద భాగంలో ఎద్దు, పొట్టేలు విగ్రహాలు ఉన్నాయి. కాగా, విగ్రహం బయట పడినట్లు వార్తలు రావడంతో స్థానికులు ఘటనా స్థలానికి చేరుకొని పసుపు, కుంకుమలతో అలంకరించి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు.

# దొనగుట్టపై చారిత్రక ఆధారాలు

చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి



దొనగుట్టపై ఆధారాలను చూపుతున్న రత్నాకర్‌రెడ్డి

నయీంనగర్/న్యూశాయంపేట, డిసెంబర్ 8: హనుమకొండ జిల్లా శాయంపేట దొనగుట్ట(త్రివేదాద్రి)పై తొలిసారిగా నవీన శిలాయుగానికి చెందిన చారిత్రక ఆధారాలు వెలుగులోకి వచ్చాయి. చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి, పాతూరి రఘురామయ్యతో కలిసి శాయంపేట గుట్టలను సందర్శించి వివరాలు వెల్లడించారు. శాయంపేట గుట్టపై శ్రీసంతోష లక్ష్మీ నరసింహస్వామి దేవాల యం వెనుక వైపున సమతల ప్రాంతంలో నవీన శిలాయుగపు (గ్రూప్స్) ఆధారాలు ఉన్నాయని, వీటిని బట్టి సుమారు ఐదువేల ఏళ్ల కింద ట మానవులు ఇక్కడ రాతి పనిముట్లను తయారు చేసుకునేవారని, వ్యవసాయం చేసేవారని తెలుస్తుందని చె ప్పారు. ఆలయం వెనుక భాగంలో స్వయంభూ శివలింగం, తొలచిన వామన గుంటలు, చాళుక్యుల నాటి వినాయక విగ్రహం ఉన్నాయని, ఆధారాలను తెలిపే వివరాలను అందుబాటులో ఉంచితే ఆలయ చారిత్రక విలువ రెండింతలు పెంచినట్లు అవుతుందని తెలిపారు.

# రైతులపై కొమ్మూరి అనుచిత వ్యాఖ్యలు

- అన్నదాతలను తాగుబోతులుగా వర్ణించిన జనగామ డీసీసీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి
- ప్రజాపాలన విజయోత్సవ సభలో వివాదాస్పద వ్యాఖ్యలు

మడికొండ, డిసెంబర్ 8 : మడికొండలో జరిగిన విజయోత్సవ సభకు హాజరైన కాంగ్రెస్ జనగామ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి రైతులను తాగుబోతులుగా వర్ణించాడు. కేసీఆర్ పాలనలో రైతులను ఆదుకునేందుకు ప్రవేశపెట్టిన రైతుబంధుపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ రైతుబంధు అందిస్తే రైతులు ముందుగా మద్యం షాపులకు వెళ్లి తాగి మిగిలిన డబ్బులను వ్యవసాయానికి వాడుకునే వారని విమర్శించారు. దీంతో అక్కడికి వచ్చిన రైతు నాయకులు, రైతులు ఒక్కసారిగా కంగుతిన్నారు.